వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, జులై 24, 2026

# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు




- **నీట్ అక్రమాలపై మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**
- **కమలాపూర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**

**కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ముఖ్య నాయకులు, విద్యార్థుల అక్రమ అరెస్టులు, పోలీసుల లాఠీఛార్జ్‌ను నిరసిస్తూ కమలాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్–ఛార్జ్ వొడితల ప్రణవ్ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అంటే దేశ ప్రజల గొంతు నొక్కడమేనని మండిపడ్డారు. దేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న నీట్ పరీక్షల నిర్వహణ అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అక్రమాలపై నోరు మెదపకపోవడం ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమేనని వారు ధ్వజమెత్తారు. ఈ ధర్నా కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవటం ఝాన్సీ రవీందర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి విష్ణుదాస్ వంశీధర్ రావు, భీంపల్లి సర్పంచ్ వాసాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పోడేటి బిక్షపతి, డాక్టర్ మౌటం కుమార్ స్వామి, బొల్లం రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ తడక శ్రీకాంత్, ఉప్పల్ సర్పంచ్ మొండేద్దుల నాగరాజు, మర్రిపల్లి సర్పంచ్ ఇనగల రాజు, జిల్లా SC సెల్ నాయకుడు గుడెపు మోగిలయ్య, భీంపల్లి మాజీ సర్పంచ్ గవ్వాజి కుమారస్వామి, మార్కెట్ డైరెక్టర్లు కిన్నెర కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు పెరుమాళ్ళ పరశురాములు, బాలపురి కనుకరత్నం, నాంపల్లి ప్రభాకర్, అశోక్ రావు, పల్లె సంతోష్, రాములు, చిలుక రవీందర్, రమేష్ చిరంజీవి, చెలివేరు రవి, గంధసిరి బిక్షపతి, బాలాజీ, పూసల గణేష్, ఇమాముద్దీన్, తాళ్ల శ్రీధర్, నేదునూరి నాగరాజు, రవి చంద్ర, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్, నవీన్, మాట్ల కళ్యాణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం

**డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**

**అందుబాటులోకి అత్యాధునిక 'హైపర్ సైట్' సాంకేతికత**




**హనుమకొండ/సికింద్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** క్యాన్సర్ వ్యాధిని జయించడానికి మనోధైర్యాన్ని మించిన గొప్ప వైద్యం మరొకటి లేదని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి రేడియేషన్ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో అత్యంత ఆధునిక 'హైపర్ సైట్' సాంకేతికత ద్వారా క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. భారతదేశంలోనే తొలిసారిగా ఈ వినూత్న టెక్నాలజీ ఒక్క యశోద ఆసుపత్రిలోనే అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతానికి మాత్రమే నేరుగా రేడియేషన్ అందిస్తామని, దీనివల్ల ఇతర ఆరోగ్యకరమైన శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయని వివరించారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిరంతరం ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఆధునిక వైద్య పరిజ్ఞానంతో ఇప్పటికే వేలాది మంది రోగులు విజయవంతంగా చికిత్స పొంది కోలుకున్నారని చెప్పారు. ఈ అత్యాధునిక వైద్య సదుపాయాన్ని తెలుగు రాష్ట్రాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ రాజకుమార్, ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **అవగాహన కల్పించిన క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్**
- **4వ బెటాలియన్‌లో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు**
- **మోసపోతే తక్షణమే '1930'కి కాల్ చేయాలి**



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** : మామునూరులోని 4వ బెటాలియన్ ప్రాంగణంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బెటాలియన్స్) ఆదేశాల మేరకు శుక్రవారం సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సబ్ ఇన్‌స్పెక్టర్ చరణ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ జహూర్ హాజరై బెటాలియన్ సిబ్బందికి, అధికారులకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో



సైబర్ నేరాలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఆర్థికంగా, మానసికంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు మరియు రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. యువత ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసలుగా మారి విలువైన జీవితాలను, కష్టార్జితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. దురదృష్టవశాత్తు ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, దీనివల్ల పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, రవి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్లతో పాటు పలువురు అధికారులు, బెటాలియన్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.